క్లుప్తంగా

ఎమ్మార్సీకి చేరిన పాఠ్య పుస్తకాలు

సీతారామపురం: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు మండల విద్యావనరుల కేంద్రానికి శనివారం చేరాయి. 1 నుంచి 10వ తరగతి వరకు గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులు కలిపి 5,228 పాఠ్యపుస్తకాలు అందినట్లు ఎంఈఓ మస్తాన్‌వలి తెలిపారు. మంగళవారం వాటిని ఆయా ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేస్తామన్నారు.

20న జాబ్ మేళా

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న ఆత్మకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వెంకటరమణారెడ్డి శనివారం తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సీ విజయ్‌వినీల్ కుమార్ ఆదేశాల మేరకు నిర్వహించే జాబ్ మేళాకు పలు ప్రముఖ కంపెనీలు హాజరవుతున్నట్లు చెప్పారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లమో, ఐటీఐ చదివిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 95734 82179, 63015 29271 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

ఆత్మకూరురూరల్: ఈ నెల 18న పౌర్ణమి సందర్భంగా అరుణాచలం క్షేత్రం వెళ్లే భక్తుల కోసం ఆత్మకూరు నుంచి ప్రత్యేక బస్సు సర్వీసును నడుపుతున్నట్లు ఆత్మకూరు డిపో మేనేజర్ కరిముల్లా శనివారం తెలిపారు. 17వ తేదీ ఉదయం 8 గంటలకు బస్సు బయలుదేరుతుందని చెప్పారు. రానుపోను టిక్కెట్ ధర రూ.1400గా నిర్ణయించామన్నారు. వివరాలకు 99592 25645, 99660 09395, 73828 83299 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రూ.98లక్షల రికవరీకి ఆదేశం

కొండాపురం: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం నుంచి అర్ధరాత్రి 3.30 గంటల వరకు ఉపాధి సామాజిక తనిఖీ ప్రజావేదిక కొనసాగింది. మండలంలోని 19 పంచాయతీల పరిధిలో జరిగిన ఉపాధి పనులపై విచారణ జరిపిన అడిషనల్ పీడీ గాయత్రిదేవి రూ.98 లక్షల మేర అవకతవకలు జరిగినట్లు గుర్తించి రికవరీ చేయాలని ఎంపీడీఓ బ్రహ్మయ్యను ఆదేశించారు.

న్యాయవాదిపై దాడి

కావలి: న్యాయవాదిపై దాడికి పాల్పడిన కేసులో ప్రధాన నిందితుడైన షేక్ కలీం అలియాస్ మున్నాను శనివారం అరెస్ట్ చేసినట్లు కావలి రూరల్ సీఐ జీ రాజేశ్వరరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన మీడియాకు తెలిపారు. పట్టణంలోని బుడంగుంట కాలనీకి చెందిన లింగాబత్తిన జయలక్ష్మి కావలి కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. గురువారం అర్ధరాత్రి బుడంగుంట కాలనీ 9వ లైన్‌లో కోలాటం అయిపోయిన తరువాత న్యాయవాది తన కుమారుడితో కలిసి నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నారు. ఆ సమయంలో షేక్ మున్నా అలియాస్ కలీం, కీర్తి అలియాస్ సోనీ, నవ్య, తదితరులు కలిసి అడ్డగించారు. మున్నా అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా ఇటుకరాయితో న్యాయవాది తలపై కొట్టాడు. కీర్తి, నవ్య కోలాటం కర్రలతో కొట్టారు. గాయపడిన బాధితురాలు కావలి ఏరియా ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు ప్రధాన నిందితుడు మున్నాను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

18,19న క్రీడా ఎంపికలు

కావలి: ఈ నెల 18, 19వ తేదీల్లో కావలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మండల ఎస్‌జీఎఫ్ సెలెక్షన్స్ జరుగుతాయని ఎంఈఓలు గోవిందయ్య, వెంకటసుబయ్య శనివారం తెలిపారు. కబడ్డీ, ఖోఖో, షటిల్, బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్, తదితర విభాగాల్లో ఎంపికలు ఉంటాయని చెప్పారు. 14 ఏళ్లు పైబడిన బాలబాలికలు అర్హులని తెలిపారు.

ఘనంగా హిందీ దివస్



ఏఎస్‌పేట కేజీబీవీలో బహుమతుల ప్రదానం

అనుమసముద్రంపేట: స్థానిక కస్తూర్బా విద్యాలయంలో హెడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హిందీ దివస్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు హిందీపై వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. హెడ్స్ నిర్వాహకుడు వెలగపాటి వెంకటేశ్వర్లు, దొరస్వామిరెడ్డి, రమణారెడ్డి, నాగిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, హేమలత పాల్గొన్నారు.

చేజర్ల: ఆదూరుపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో వైస్‌ప్రిన్సిపల్, హిందీ ఉపాధ్యాయిని నాగలలిత ఆధ్వర్యంలో విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

ఏచూరి మృతికి సంతాపం

సోమశిల/మర్రిపాడు: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం మృతిపై ఆ పార్టీ అనంతసాగరం, మర్రిపాడు మండల నాయకులు శనివారం సంతాపం తెలిపారు. అనంతసాగరంలోని పార్టీ కార్యాలయంలో మండల కమిటీ నాయకుడు అన్వర్‌బాషా ఆధ్వర్యంలో, మర్రిపాడులోని పార్టీ కార్యాలయంలో జిల్లా రైతు సంఘంకార్యదర్శి మూలి వెంగయ్య, మండల కార్యదర్శి సయ్యద్ రహమతుల్లా, సీఐటీయూ కార్యదర్శి బత్తల రత్తయ్య, తదితరుల ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వరి ఎండుముఖం







సాగునీరందక ఎండిన పైరు

- బోర్లపై ఆధారపడి 450 ఎకరాల్లో సాగు
- వెన్ను, కరుకు దశలో పంట
- వర్షాభావంతో అడుగంటిన బోర్లు
- పడమటి గాలులకు ఎండిపోతున్న పైరు
- ఆందోళనలో అన్నదాతలు
- సోమశిల జలాలు అందించి ఆదుకోవాలని వినతి

అన్నదాతలను ఆదుకోవాలి



బొగ్గేరు భూగర్భజలాలపై ఆధారపడి వరి పైరు సాగు చేశాం. మరో పది రోజులు సాగునీరు అందితే పంట చేతికొస్తుంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా బోర్లు అడుగంటి సాగునీరు అందక పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. ప్రభుత్వం స్పందించి ఉత్తర కాలువ ద్వారా సాగునీటిని అందించి ఆదుకోవాలి.

– రావూరు రత్నాకర్‌రెడ్డి, రైతు, బోయలచిరివెళ్ల, ఆత్మకూరు

ఆత్మకూరురూరల్: బొగ్గేరు జీవజలాలపై రైతులు పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి. వర్షాభావ పరిస్థితులతో భూగర్భజలాలు అడుగంటి బోర్లు ఎండిపోయాయి. దీంతో అప్పులు చేసి సాగుచేసిన వరి పంట సాగునీరందక ఎండుముఖం పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమశిల జలాలను అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు. ఆత్మకూరు మండలంలోని ఆరవీడు, జంగాలపల్లి, బోయలచిరివెళ్ల, కరటంపాడు, తదితర గ్రామాల్లోని రైతులు ఏటా బొగ్గేరు జీవ జలాలపై ఆధారపడి రెండు కారు పంటను సాగుచేస్తుంటారు. ఈ ఏడాది 450 ఎకరాలకుపైగా వరి పంట సాగు చేపట్టారు. ఒక్కో ఎకరా సాగుకు రూ.40 వేలు వరకు పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం వరి పంట పొట్ట, వెన్ను దశలో ఉంది. ఈ దశలో సాగునీరు పుష్కలంగా ఉంటేనే దిగుబడులు బాగా వస్తాయి. అయితే వర్షాభావ పరిస్థితులతో భూగర్భజలాలు అడుగంటడంతో బోర్లు ఎండిపోయాయి. దీనికి తోడు గత వారం రోజులుగా ఎండలు మండుతుండడం.. పడమటి గాలులు వీస్తుండడంతో సాగునీరందక వరి పైరు ఎండుముఖం పడుతుండడంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. ప్రస్తుతం సోమశిల జలాశయంలో 50 టీఎంసీలు ఉన్నాయి. ఉత్తర కాలువ ద్వారా వారం రోజుల పాటు సాగునీటిని సరఫరా చేస్తే పంటలను కాపాడుకునేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వం స్పందించి సాగునీరందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ముగిసిన పొగాకు వేలం



పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో పొగాకు వేలం ప్రక్రియ శనివారంతో ముగిసింది. 2023–24 పంట కాలానికి సంబంధించి 4989 హెక్టార్లలో 1720 బ్యారెన్లలో 2085 మంది రైతులు పొగాకు సాగు చేపట్టారు. పొగాకు కొనుగోళ్లు ఏప్రిల్ నెలలో ప్రారంభమయ్యాయి. రైతుల నుంచి అధిక దిగుబడి ఉండడంతో ఎటువంటి అపరాధ రుసుము లేకుండా విక్రయానికి బోర్డు అనుమతించడంతో సెప్టెంబర్ వరకు వేలం కొనసాగింది. గత పంట కాలంలో 89 రోజుల పాటు కొనసాగిన వేలం ప్రక్రియ ఈ దఫా సుదీర్ఘంగా 125 రోజుల పాటు కొనసాగింది.

అన్ని రకాల గ్రేడ్లకు మంచి ధరలు

గతంలో పొగాకు రైతులు ఏటా నష్టాలను చవిచూసే వారు. గత మూడేళ్ల నుంచి పొగాకు ధరలు ఆశాజనకంగా ఉంటున్నాయి. ఈ ఏడాది అన్ని రకాల గ్రేడ్లకు మంచి ధరలు లభించడంతో రైతుల కష్టానికి మంచి ఫలితం దక్కింది. ఈ పంటకాలంలో పొగాకు చూర, పండుగుల్ల కూడా విక్రయాలను సాగించారు. ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా పొగాకు రైతులు పండించిన పంట అమ్ముడైంది.

సగటు ధర రూ.261.53గా నమోదు

డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో ఈ ఏడాది కిలో పొగాకు సగటు ధర రూ.261.53గా నమోదైంది. గరిష్ట ధర రూ.358గా నమోదు కాగా, కనిష్ట ధర రూ.60 లభించింది. వేలానికి 97,570 బేళ్లు రాగా, వాటిలో 81,968 బేళ్లను విక్రయించారు. 15,602 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. పొగాకు బోర్డు 6.30 మిలియన్ కిలోల పొగాకును పండించేందుకు అనుమతించగా, 9.75 మిలియన్ కిలోల పొగాకును విక్రయించారు. మొత్తం మీద రూ.259 కోట్ల వ్యాపారం జరిగింది.

రైతుల సంక్షేమానికి పెద్దపీట

ఈ ఏడాది ఎటువంటి ఒడిదొడుకులు లేకుండా పొగాకు రైతులు పండించిన పంటను అమ్ముకున్నారు. బోర్డు రైతుల సంక్షేమానికి కావాల్సిన అన్ని చర్యలను తీసుకొంది. వచ్చే పంట కాలానికి సంబంధించి ఒక బ్యారెన్‌కు 4275 కిలోలు అనుమతించబడింది. పొగాకు బోర్డు అనుమతించిన మేరకే పంట పండించాలి. అధికంగా పండిస్తే రైతులు నష్టపోయే ప్రమాదముంది. పొగాకు బ్యారెన్లు, భూమి అధిక కౌలుకు తీసుకోవడం వల్ల నష్టాలు వచ్చే ప్రమాదం ఉంది. ఈ ఏడాది ప్రశాంతంగా వేలం ప్రక్రియ ముగిసేందుకు సహకరించిన రైతులకు, అధికారులకు ధన్యవాదాలు.

–జీ రాజశేఖర్, వేలం నిర్వహణాధికారి, డీసీపల్లి

లోక్‌అదాలత్‌లో కేసులు సత్వరమే పరిష్కారం



కావలి: మాట్లాడుతున్న జడ్జి ఎం శోభ

కావలి: లోక్‌అదాలత్‌లో కేసులను సత్వరమే పరిష్కరించడం జరుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి ఎం శోభ పేర్కొన్నారు. కావలి సబ్‌కోర్టు ఆవరణలో జాతీయ మెగా లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ కోర్టుల చుట్టూ తిరిగిన సమయాన్ని, నగదును వృథా చేసుకోకుండా కక్షిదారులు రాజీపడి వస్తే లోక్‌అదాలత్‌లో కేసులను సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి ఎం శోభ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఈ సుధాకర్, అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ విక్రమ్ సింహ కలిసి 1438 కేసులను పరిష్కరించారు. సుమారు రూ.57,91,579 నగదును పరిహారంగా అందించారు. బ్యాంకు కేసులకు సంబంధించి పీఎల్‌సీ ద్వారా సుమారు రూ.8 లక్షలు రికవరీ చేశారు. ఏపీపీ మృదుల, కావలి న్యాయవాద సంఘ ప్రెసిడెంట్ సురేంద్రరెడ్డి, కార్యదర్శి జయప్రకాష్, లోక్ అదాలత్ మెంబర్ మాలకొండారెడ్డి, న్యాయవాదులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో 2128 కేసుల పరిష్కారం

ఆత్మకూరు: ఆత్మకూరు సీనియర్, జూనియర్ సివిల్ కోర్టుల్లో నిర్వహించిన జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో 2,128 కేసులను పరిష్కారించినట్లు సీనియర్ సివిల్ జడ్జి (ఎఫ్ఏసీ) ఎస్ శ్రీనివాసులు తెలిపారు. సివిల్ కేసులు 13, క్రిమినల్ కేసులు 100, బ్యాంకు కేసులు 15, ఎస్‌టీసీ (పెట్టి) కేసులు 2వేలు పరిష్కారమైనట్లు వివరించారు. జూనియర్ సివిల్ జడ్జి ఎల్ జగదీష్ కుమార్, లోక్ అదాలత్ సభ్యుడు కేవీ శేషారెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉదయగిరిలో 73 కేసులు పరిష్కారం

ఉదయగిరి: ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జడ్జి జే అంజయ్య ఆధ్వర్యంలో జాతీయ మెగా లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీకి ఆమోదయోగ్యమైన సివిల్, క్రిమినల్, మోటార్ వాహనాల ప్రమాదాలు, కుటుంబ వివాదాలకు సంబంధించిన 73 కేసులను పరిష్కరించారు. ఏపీపీ ఎస్ సుకన్య, సీఐ ఎస్ వెంకటరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

దుకాణాల కొలతల అడ్డగింత



అడ్డుకుని ఆందోళన చేస్తున్న దుకాణదారులు

ఆత్మకూరు: పట్టణంలోని వివాదాస్పద కొలగాని రామయ్యసత్రం భూమిలోని దుకాణాలను దేవాదాయ శాఖ గ్రూప్ ఈఓ ప్రసాద్ రెడ్డి, గుమస్తా సుధాకర్ ఆధ్వర్యంలో శనివారం కొలతలు వేసేందుకు ప్రయత్నించగా దుకాణాదారులు అడ్డుకున్నారు. తాము కోర్టుకు వెళ్లగా 23వ తేదీ వరకు స్టే విధించిందని, అలాంటప్పుడు కొలతలు ఎలా వేస్తారని ప్రశ్నించారు. ఈ విషయమై కొద్దిసేపు ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. అనంతరం దేవాదాయశాఖ అధికారులు కొలతలు వేయడాన్ని నిలిపివేశారు. ఈ విషయమై ఈఓ ప్రసాద్‌రెడ్డిని సంప్రదించగా దుకాణ దారులు మున్సిపల్ స్థలంలోనే దుకాణాలు నిర్మించుకున్నామని, దేవాదాయ శాఖ స్థలంలో నిర్మాణాలు చేపట్టలేదని కోర్టుకు విన్నవించడంతో కొలతలు వేసేందుకు వచ్చామని వివరించారు.

ప్రకృతిపై మమకారంతో..

- పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు, రైతుల్లో చైతన్యం
- ఆదర్శంగా నిలుస్తున్న వృక్షశాస్త్ర అధ్యాపకురాలు ఉమమహేశ్వరి



ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకురాలు ఉమామహేశ్వరి

కావలి: ఉద్యోగం అంటేనే నెల తర్వాత వచ్చే జీతం కోసం అన్నట్లుగా భావిస్తున్న రోజులు ఇవి. కానీ కొందరు మాత్రం విధి నిర్వహణతో పాటు సమాజ శ్రేయస్సుకు పాటుపడుతుంటారు. అలాంటి కోవకు చెందిన వ్యక్తే కావలిలోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పీజీ కళాశాలలో వృక్షశాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్న పొడమేకల ఉమామహేశ్వరి. అధ్యాపకురాలిగా తరగతి గదుల్లో పాఠాలు చెప్పడానికి మాత్రమే పరిమితం కాకుండా ప్రకృతిపై మమకారంతో విద్యార్థులు, రైతుల్లో పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. మొక్కలు నాటడం, వాటిని పెంచడంపై ఆసక్తి కలిగించే విధంగా క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులను పొలాల్లోకి తీసుకెళ్లి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నారు. రైతులకు కూడా ప్రకృతి వ్యవసాయం వల్ల ఒనగూరే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయం మేలు

ప్రస్తుత వ్యవసాయ విధానంలో రసాయన ఎరువులు, మందుల వాడకం పెరిగిపోవడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. అంతుచిక్కని జబ్బుల బారినపడి ఇబ్బందులు పడుతున్నారు. పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంతో వాతావరణ కాలుష్యం తగ్గుతుంది. ఆరోగ్యకరమైన, విషరహితమైన, నాణ్యమైన పంటలు చేతికందుతాయని అంటారామె. ఈ పంటలకు ఎక్కువ మద్దతు ధర లభిస్తుందని, రైతులు అప్పులు చేయనక్కర లేదని, రోగాలబారి నుంచి ప్రజలకు విముక్తి లభిస్తుందని ఆమె చెబుతున్నారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని, రసాయన రహిత పంటలను సాగు చేయాలని సూచిస్తున్నారు. ఆ దిశగా రైతులతో పాటు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ చైతన్యవంతం చేస్తున్నారు.

చేపట్టిన కొన్ని కార్యక్రమాలు

- కావలి మండలం కొత్తపల్లిలోని పొలాల్లో ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన.
- కందుకూరు మండలం వెంకటాద్రిపాలెంలో ప్రకృతి వ్యవసాయ సాగుకు భూమి సన్నద్ధపై అవగాహన.
- పుట్టగొడుగుల పెంపకంపై విద్యార్థులకు అవగాహన.
- కావలిలోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పీజీ సెంటర్ ప్రాంగణంలో విద్యార్థులతో మొక్కలు నాటించడం.

విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యం



ప్రకృతి వ్యవసాయం అంటే సాగులో రసాయనాలు తగ్గించడం, నీటిని సంరక్షించడం, భూసారాన్ని పెంచడం..తద్వారా దీర్ఘకాలికంగా వ్యవసాయ సాగు ఆర్థిక భారం కాకుండా పర్యావరణాన్ని కాపాడుకుంటూ ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పొందడం. ఈ విధానంపై విద్యార్థుల్లో అవగాహన, ఆసక్తి పెంపొందిస్తే వారు పెద్దయ్యాక వాటిపై మరింత చొరవ తీసుకుంటారు. ఆ దిశగా విద్యార్థులతో పాటు రైతులకు క్షేత్ర స్థాయిలో ప్రకృతి వ్యవసాయం సాగు పద్ధతులు తెలియజేస్తున్నాం. అలాగే పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడాన్ని కూడా ప్రతిఒక్కరూ బాధ్యతగా ఉండాలి.

–పొడమేకల ఉమామహేశ్వరి, వృక్షశాస్త్ర అధ్యాపకురాలు, కావలి

'విట్స్'లో విశ్వోత్సవ్ సంబరాలు



కావలి: పట్టణంలోని విట్స్ కళాశాలలో విశ్వోత్సవ్–2024 సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా రెండో రోజు శనివారం సాంకేతిక, సాంస్కృతిక ఫెస్ట్‌లను నిర్వహించారు. కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కళాశాల రెక్టార్ వినయ్ కుమార్‌రెడ్డి, చైర్మన్ విద్యాధర్‌రెడ్డి, ప్రిన్సిపల్ శేషయ్య, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



ఉదయగిరి: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి సూచించారు. పట్టణంలో జమాతే ఇస్లాం హిందూ మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు చిన్న తనంలోనే ప్రేమ, సెల్‌ఫోన్ల మోజులో పడి జీవితాన్ని కోల్పోతున్నారన్నారు. వీటి నుంచి యువతను దూరం చేసేందుకు సంస్థ చేస్తున్న కృషి అభినందనీమన్నారు.

ఆపస్ ప్రాంతీయ కార్యాలయం ప్రారంభం



ఆత్మకూరు: పట్టణంలో సోమశిలరోడ్ సెంటర్ వద్ద ఆపస్ నూతన ప్రాంతీయ కార్యాలయాన్ని ఆపస్ రాష్ట్రాధ్యక్షుడు ఎస్ బాలాజీ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటు వారికి సేవలు అందించడంలో ఆపస్ ముందుంటుందన్నారు. ప్రాంతీయ కార్యాలయం కోసం భవనాన్ని ఉచితంగా అందజేసిన నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజగోపాలచారి, ప్రధాన కార్యదర్శి అనీల్‌కుమార్, కలిశెట్టి రవీంద్రకుమార్, అన్నపురెడ్డి పెదవెంకటరెడ్డి, రాధాకృష్ణ, సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, జగదీష్, శ్రీనివాసులు, విశ్రాంత హెచ్‌ఎం చలమయ్య పాల్గొన్నారు.

అడవి దున్నపోతు పొడిచి వృద్ధురాలి మృతి

ఉదయగిరి: అడవి దున్నపోతు పొడిచి ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషాద ఘటన మండలంలోని తిరుమాలపురం పంచాయతీ గుడినవరలో శుక్రవారం సాయంత్రం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన మట్ల వెంగమ్మ(60) తన పశువులను రోజూ అటవీ ప్రాంతానికి మేత కోసం తోలుకెళ్తుంది. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఇంటికి వచ్చిన పశువులను తన ఇంటి బయట కట్టేసేందుకు వెళ్లింది. ఇదే సమయంలో తమ పశువులతో పాటు అడవి దున్నపోతు రాకను ఆమె గమనించలేదు. పశువులు కట్టేసేందుకు ప్రయత్నిస్తుండగా అడవి దున్నపోతు ఆమెను కుమ్మేయడంతో తీవ్ర గాయాలపాలైంది. అక్కడే ఉన్న ఆటోడ్రైవర్ రవిపై కూడా దున్నపోతు దాడి చేయడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. గమనించిన గ్రామస్తులు దున్నపోతును తరమేసి గాయపడిన వెంగమ్మను వెంటనే ఉదయగిరి సామాజిక ఆరోగ్యకేంద్రం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం అందించే ఆర్థి స్థోమత లేక ఇంటికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని బంధువులకు అప్పగించారు.

వరద బాధితులకు నగదు విరాళం



విరాళం అందజేసిన లుంబిని విద్యార్థులు



ఎస్సై సమక్షంలో విరాళం అందజేసిన ఠాగూర్ స్కూల్ యాజమాన్యం



విరాళాన్ని అందజేసిన శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు

చేజర్ల: విజయవాడ వరద బాధితుల సహాయార్థం చేజర్లలోని లుంబిని విద్యాలయం విద్యార్థులు విరాళాల ద్వారా రూ.88,020 నగదు సేకరించారు. ఈ మొత్తాన్ని పాఠశాల కరస్పాండెంట్ రమేష్‌కు శనివారం అందజేశారు. వరద బాధితుల కష్టాలను చూసి చలించి మానవతా దృక్పథంతో విరాళాలను సేకరించి అందజేసిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఆత్మకూరు నియోజకవర్గ ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు కోటిరెడ్డి ద్వారా వరద బాధితులకు నగదు విరాళాన్ని అందజేయనున్నట్లు కరస్పాండెంట్ తెలిపారు.

ఠాగూరు స్కూల్ విద్యార్థుల విరాళం

అనుమసముద్రంపేట: విజయవాడ వరద బాధితుల కోసం ఏఎస్‌పేటలోని ఠాగూర్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ.1,66,610 నగదు విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని ఏఎస్‌పేట ఎస్సై సైదులు సమక్షంలో పాఠశాల కరెస్పాండెంట్ రమణారెడ్డి, డైరెక్టర్ దొరస్వామిరెడ్డికి శనివారం అందజేశారు. ఈ మొత్తాన్ని నెల్లూరు అపస్మా ద్వారా సీఎం సహాయనిధికి అందజేయనున్నట్లు వారు తెలిపారు.

శాంతినికేతన్ పాఠశాల విద్యార్థుల విరాళం

సోమశిల: విజయవాడ వరద బాధితుల కోసం అనంతసాగరంలోని శాంతినికేతన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విరాళాల ద్వారా రూ.1,88,500 నగదును సేకరించారు. ఈ మొత్తాన్ని ఎంఈఓ–2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డికి శనివారం అందజేశారు. నెల్లూరు అపస్మా తరఫున సీఎం సహాయనిధికి నగదును అందజేయనున్నట్లు హెచ్‌ఎం తెలిపారు.

సంఘ విద్రోహ శక్తులపై ప్రత్యేక నిఘా

- మెరైన్ డీఎస్పీ బాలరాజు



మాట్లాడుతున్న డీఎస్పీ బాలరాజు

అల్లూరు: తీర ప్రాంతంలోకి సంఘ విద్రోహ శక్తులు చొరబడకుండా ప్రత్యేక నిఘాను ఉంచామని మెరైన్ డీఎస్పీ బాలరాజు తెలిపారు. మండలంలోని ఇస్కపల్లి తీరప్రాంతంలోని మెరైన్ పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్ర మార్గం నుంచి సంఘ విద్రోహశక్తులు, స్మగ్లర్లు చొరబడకుండా ప్రత్యేక నిఘాను ఉంచామన్నారు. గణపతి ప్రతిమలను సముద్రంలో నిమజ్జనం చేసే సమయంలో ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విశాఖపట్నం సౌత్ జోన్‌లోని మెరైన్ సేషన్లను తనిఖీ చేస్తున్నామని తెలిపారు. అనంతరం స్థానిక మత్స్యకారులతో సమావేశమయ్యారు. తీరంలో గుర్తుతెలియని వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే మెరైన్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మెరైన్ సిబ్బంది, మత్స్యకార కాపులు తదితరులు పాల్గొన్నారు.

గౌతమ్‌రెడ్డి పేరు తొలగింపు



సంగం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు సంగం బ్యారేజ్ వద్ద దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరు తొలగింపు కార్యక్రమం చేపడుతున్నారు. అందులో భాగంగా శుక్రవారం బ్యారేజ్ బయట బోర్డుపై ఉన్న మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరును తొలగించారు. శనివారం బ్యారేజ్‌పై సిమెంట్‌తో నిర్మించిన మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరును తొలగించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఆత్మకూరు: పెన్నా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పట్టుకునట్లు ఆత్మకూరు ఎస్సై షేక్ జిలానీ తెలిపారు. మండలంలోని బందారుపల్లి నుంచి ఆత్మకూరుకు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పరిశీలించగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

బైక్ ఢీకొని యువతికి గాయాలు

కావలి: బైక్ ఢీకొనడంతో యువతి గాయపడిన ఘటన పట్టణంలోని తుఫాన్‌నగర్‌లోని జంగాలకాలనీలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు..జంగాల కాలనీకి చెందిన షేక్ మోమిన తన ఇంటి ముందు రోడ్డు మార్జిన్‌లో నిలబడి ఉండగా, షరీఫ్ అనే వ్యక్తి బైక్‌పై అతివేగంగా వచ్చి వెనకగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మోమినాకు గాయాలవగా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.